

# విచక్షణ జ్ఞానం

'కృనవరం' అనే గ్రామంలో ఉండే భీముడు వట్టి అమాయకుడు. తల్లి దండ్రులు చిన్నతనంలోనే చనిపోతే, భీముడుని వాళ్ళ తాత పెంచి పెద్ద చేశాడు. భీముడికి పెద్దగా చదువబ్బలేదు. ప్రతి విషయాన్ని ఒకటికి రెండు సార్లు వివరించి చెబితే కాని వాడికి అర్థమయ్యేది కాదు. అయితే భీముడు ఒళ్ళుదాచుకోకుండా, కాయకష్టం చేసేవాడు. దేనికి భయపడేవాడు కాదు. తాత తన అనుభవం, వివేకంతో భీముడికి వాడి అమాయకత్వం వల్ల ఏ ఇబ్బంది రాకుండా చూసేవాడు. తాతకి కొద్దిపాటి భూమి ఉంది. కాని అది సేద్యానికి పనికి రాకుండా పోయింది. అందువల్ల పక్కనే ఉన్న అడవి నుంచి రకరకాల పళ్ళు ఏరుకొచ్చేవాడు. కూరలు, పళ్ళు అమ్మగా వచ్చిన డబ్బు వారిద్దరు బ్రతకడానికి బొటాబొటీగా సరిపోయేది.

**కొల్లూరి సోమశంకర్**

ఈ తరహా రోజు వారీజీవనంపై విసుగెత్తిన భీముడు ప్రక్క ఊరు 'శృంగవరం' వెళ్ళి, అక్కడ ఏదైనా పని వెతుక్కుందామని అనుకున్నాడు. ఆ ఊర్లోని పెద్ద రైతు 'ధర్మయ్య'కు ఓ పాలేరు అవసరం ఉందని తెలుసుకున్న భీముడు శృంగవరం వెళ్ళి ధర్మయ్యను కలుద్దామని అనుకున్నాడు. భీముడి అమాయకత్వం గురించి బెంగగా ఉన్న తాత అందుకు అంగీకరించలేదు. కాని భీముడు తన మొండి పట్టు విడువక పోవడంతో, తాత... ''ఒరే, నువ్వు అక్కడ కొలువులో చేరితే చేరు, నేను మాత్రం మన గ్రామం విడిచి రాను. నువ్వే అప్పుడప్పుడూ వచ్చి, నన్ను చూసిపోతుండు...'' అంటూ అయిష్టంగానే భీముడిని ధర్మయ్య వద్దకు పంపాడు. నిజానికి ఆ ధర్మయ్య దుష్టుడు, మోసకారి. పేదలకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి, వాటిని తీర్చలేని వాళ్ళ ఆస్తుల్ని తన స్వంతం చేసుకునేవాడు. తన హోదాని, ధనాన్ని అడ్డం పెట్టుకుని పేద సాదల్ని పీడించేవాడు. అతడి పలుకుబడికి భయపడి బాధితులెవరు న్యాయాధికారికి ఫిర్యాదు చేసేవారు కాదు. ఈ వివరాలేవి తెలియని భీముడు వెళ్ళి ధర్మయ్యని కలిసి ఉద్యోగం అడిగాడు. అప్పటికే ఓ పాలేరును నియమించుకున్న ధర్మయ్య భీముడిని పనిలోకి తీసుకోడానికి నిరాకరించాడు. భీముడు తన ఇబ్బందులు చెప్పుకుని, ఏదో ఒక పని ఇప్పించమంటూ బ్రతిమాలుకున్నాడు.

భీముడిని పరీక్షగా చూసిన ధర్మయ్య, వాడి అమాయకత్వాన్ని, కండ బలాన్ని గ్రహించాడు. ''సరే, నా దగ్గరే ఉండు. నేను చెప్పిన పనల్లా చెయ్యాలి. మూడు పూటల అన్నం పెట్టి, నెలకు పాతిక వరహాలు ఇస్తాను. ఇష్టమేనా'' అని అడిగాడు. భీముడు అందుకు ఒప్పుకుని, పనిలో చేరడానికి అంగీకరించాడు. వెంటనే తన గ్రామం చేరి తాతకు జరిగినదంతా చెప్పాడు. ''యజమాని చెప్పినట్లు నడుచుకో,

## సైన్సు సంగతులు

కటల్‌ఫిష్ అనే చేపకు మూడు గుండెలుంటాయి.

మనిషిలోని ఎముకల నియంత్రణ పిట్యుటరీ గ్రంథి చేస్తుంది. 13-14 ఏళ్ళ నుండి ఇది కుంచించుకోవడం ప్రారంభిస్తుంది. అందువల్లే 20-22 ఏళ్ళ వరకు పూర్తిగా పెరుగుదల ఆగిపోతుంది.

నలభై ఏళ్ళ తరువాత మనిషి శరీరం ప్రతి పదేళ్ళకు సుమారు ఒక సెంటిమీటర్ చొప్పున ముడుచుకు పోవడం మొదలవుతుంది.

సల్ఫా(డ్రగ్స్‌ను 1930 సంవత్సరంలో జర్మనీకి చెందిన 'శరీహార్డ్' హామేగ్ కనుగొన్నారు. ఈ మందుల్ని మనిషిలోని బ్యాక్టీరియా వల్ల పుట్టే రోగాల్ని నయం చేయడంలో ఉపయోగిస్తారు.

–వాసాల

చెప్పిన పనులను వాయిదా వెయ్యకుండా వెంటనే చెయ్యి...'' అంటూ ఇంకా అనేక జాగ్రత్తలు చెప్పి భీముడిని ధర్మయ్య దగ్గరకు పంపాడు తాత. ఉద్యోగంలో చేరిన తర్వాత, భీముడు అప్పుడప్పుడూ కూనవరం వచ్చి తాతను చూసి పోతుండేవాడు.

మొదట్లో ధర్మయ్య, భీముడికి ఇంటి చాకిరీ అప్పజెప్పాడు. వాడు నోరెత్తకుండా అన్ని పనులు చేసేవాడు. భీముడి విశ్వాసాన్ని, పనితనాన్ని గమనించిన ధర్మయ్య వాడిని మరో విధంగా ఉపయోగించాలనుకున్నాడు. తనకు బకాయి పడ్డ రైతులు, పేదల వద్దకు అప్పు వసూళ్ళకై భీముడిని పంపేవాడు. ఒక రోజు ధర్మయ్య భీముడిని పిల్చి ''ఒరే! ఆ రంగడు మనకు వెయ్యి వరహాలు బాకీ వున్నాడు. ఎన్నిసార్లు అడిగినా తీర్చడం లేదు. వెళ్ళి వాడి గొడ్లను తెచ్చి, మన పశువుల కొట్టంలో కట్టేయ్! అలా చేస్తే కాని వాడికి బుద్ధి రాదు...'' అన్నాడు. నిజానికి రంగడు ధర్మయ్య బాకీ ఎప్పుడో తీర్చేశాడు. కాని అందుకు రుజువుగా దస్తావేజు లేవీ లేకపోవడంతో ధర్మయ్య రంగడిని మోసం చేయదలిచాడు. ఈ విషయాలేవీ తెలియని భీముడు, రంగడు నెత్తి నోరు కొట్టుకుని వివరించినా, వినకుండా వాడి గొడ్లను బలవంతంగా లాక్కొచ్చాడు. ఇదే విధంగా ధర్మయ్య తన అక్రమాలను భీముడితో చేయిస్తూ ఉండేవాడు. యజమానిని గుడ్డిగా నమ్మిన భీముడు, ధర్మయ్య ఏం చెబితే, అది చేసేవాడు.

క్రమంగా శృంగవరంలో ప్రజలు ధర్మయ్యతో పాటు భీముడన్నా భయపడసాగారు. ఈ విషయాలన్ని కూనవరం గ్రామస్తులకి తెలిసాయి. వాళ్ళు భీముడి ప్రవర్తన గురించి పలు విధాలుగా అనుకోసాగారు. దీంతో కలత చెందిన భీముడి తాత, అసలు విషయం తెలుసుకుందామని, స్వయంగా శృంగవరం వెళ్ళాడు. ధర్మయ్య గురించి, భీముడి గురించి రహస్యంగా వాకబు చేశాడు. అక్కడి పరిస్థితులను పూర్తిగా గ్రహించిన తాత కూనవరం తిరిగి వచ్చి-తనను చూసిపోడానికి రమ్మని భీముడికి కబురు పెట్టాడు. ఆ రోజు సాయంత్రం భీముడు తన గ్రామానికి వచ్చాడు. గ్రామస్తులెవ్వరు మునుపటిలా ఆప్యాయంగా మాట్లాడకపోవడం, తనను చూసి దూరంగా వెళ్ళిపోవడం, తాత కూడ తనతో ముభావంగా ఉండడం వాడినెంతో కలవరపరిచాయి.

ఆందోళనతో భీముడు తాతను వివరాలు అడిగాడు. బదులుగా తాత ... ''ఒరే, నువ్వు తప్పు దారిలో నడుస్తున్నావు. కనుక నీకు మేమంతా దూరంగా ఉండదలిచాము...'' అంటూ భీముడి అనాలోచిత చర్యల వల్ల శృంగవరం ప్రజలు పాలవుతున్న ఇక్కట్ల గురించి చెప్పాడు. ''ఇందులో నా తప్పేం ఉంది తాతా, నువ్వే కదా యజమాని చెప్పినట్లు నడుచుకోమన్నావు ...'' అని ప్రశ్నించాడు భీముడు. ''ఒరే, అప్పుడు మీ యజమాని గుణగణాలు తెలియక నీకు అలా చెప్పాను. కాని మీ యజమాని మంచివాడు కాదు. తన తప్పుడు పనులన్నీ నీచేత చేయిస్తున్నాడు. కనుక నువ్వు చెడ్డ వాడివయ్యావు ...'' బదులిచ్చాడు తాత.

ఆలోచనలో పడ్డ భీముడు, ''తాతా, ఒక పని మంచిదో, చెడ్డదో ఎలా తెలుసుకోడం...'' అని అడిగాడు. ''దీన్ని విచక్షణ జ్ఞానం అంటారు. ఏ పనైనా చేసే ముందు ఆలోచించుకోవాలి. ఒక్కడికి మేలు చేస్తూ, పది మందికి ఇబ్బంది కల్గించే ప్రతి పనీ చెడ్డది. పది మందికి మేలు చేస్తూ, ఏ ఒక్కడికో ఇబ్బంది కలిగించినా అది మంచి పనే అవుతుంది.'' అని వివరించాడు తాత.

వాస్తవాన్ని గ్రహించిన భీముడు ధర్మయ్య వద్ద పని మానేశాడు. అంతేగాక ధర్మయ్యపై న్యాయాధికారికి ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై విచారణ జరిపిన న్యాయాధికారి నిజానిజాలు అవగతం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ... ''ఇంతకాలం ప్రజలను పీడించినందుకు ధర్మయ్యకు కారాగార శిక్ష విధిస్తున్నాను. ఉద్దేశ్యపూర్వకంగా చెయ్యనప్పటికీ, భీముడు కూడా ప్రజలకు ఇబ్బంది కలిగించాడు. తెలియక చేసినా, తెలిసి చేసినా, చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదు. అయితే శృంగవరంలో జరుగుతున్న వైద్యశాల నిర్మాణంలో ఒక నెల రోజుల పాటు ఉచితంగా పని చేయాల్సిందిగా ఆజ్ఞాపిస్తున్నాను'' అంటూ తీర్పు చెప్పారు. భీముడు అందుకు సంతోషంగా ఒప్పుకున్నాడు. శిక్షా కాలం ముగిసిన తరువాత, తన గ్రామానికి వెళ్ళి, తన గ్రామస్తుల సహాయంతో, తమ భూమిని వ్యవసాయానికి అనువుగా మార్చుకున్నాడు. అందులో పంటలు పండించుకుంటూ, తాతతో కలిసి సుఖంగా ఉన్నాడు.

సుందర్రావు రామారావు ఇంట్లో పేకాడుతూ కూర్చున్నాడు. రాత్రి పది గంటలైంది. ఆట పూర్తయ్యాక సుందర్రావు ఇంటికి బయల్దేరేటప్పటికి భోరున వర్షం కురుస్తోంది.

ఇప్పట్లో వర్షం తగ్గేటట్టు లేదు. మా మేడ మీది గదిలో పడుకుందువుగాని, పైన రూంలో నీకు ప్రక్క సిద్ధం చేసి వస్తాను అంటూ రామారావు మేడ మీదకు వెళ్ళాడు.

అయిదు నిమిషాల తరువాత రామారావు క్రిందకు వచ్చి చూస్తే సుందరావు కనిపించలేదు. ఏమై పోయాడా అని ఆశ్చర్యపోతుండగా సుందర్రావు వానలో తడిసి ముద్దయిపోతూ లోపలికి వచ్చాడు.

ఇవాళ మీ మేడ మీద గదిలో పడుకోమన్నావు గదా. అందుకని ఇంటికెళ్ళి లుంగీ తెచ్చుకున్నాను అన్నాడు సుందర్రావు.

-కాట్రగడ్డ వెంకట్రావు